ఆడబిడ్డ నిధి ఎప్పుడిస్తారో?



టెక్కలి నియోజకవర్గంలో ఆడబిడ్డ నిధికి పథకానికి అర్హత కలిగిన మహిళలు (ఫైల్)



- మహిళలను నిలువునా మోసం చేసిన కూటమి ప్రభుత్వం
- గత వైఎస్సార్‌సీపీ హయాంలో అందజేసిన పథకాలకు మంగళం

టెక్కలి: అధికారంలోకి వస్తే ఆడబిడ్డ నిధి పేరుతో మహిళలకు ప్రతి నెల 1500 రూపాయలు సాయం అందజేస్తామని కూటమి నాయకులు ఎన్నికల ముందు వాగ్దానం చేశారు. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడచినప్పటికీ ఈ పథకంపై స్పష్టత ఇవ్వడం లేదు. దీనికితోడు గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో కేవలం మహిళల పేరుతో అందజేసిన వైఎస్సార్ చేయూత, కాపునేస్తం, సున్నా వడ్డీకే రుణాలు, అమ్మఒడి పథకాలకు కూటమి ప్రభుత్వం మంగళం పాడేసింది. మహిళలకు ఇచ్చిన ఆడబిడ్డ నిధి ఎప్పుడిస్తారో స్పష్టత ఇవ్వాలని మహిళలు కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. టెక్కలి, ఇచ్ఛాపురం, పలాస నియోజకవర్గాల్లో వేలాది మంది మహిళలు ఆడబిడ్డ నిధుల కోసం ఎదురు చూస్తున్నారు. ఒక్క టెక్కలి నియోజకవర్గంలో 1,16,080 మంది మహిళలు ఈ పథకం ఆశగా చూస్తున్నారు.

టెక్కలి నియోజకవర్గంలో ఇలా..

మండలం	మహిళలు
టెక్కలి	32,100
కోటబొమ్మాళి	29,700
నందిగాం	25,110
సంతబొమ్మాళి	29,130

మహిళలను మోసం చేయడమే చంద్రబాబు నైజం



మహిళలను మోసం చేయడం చంద్రబాబుకు అలవాటే. ఎన్నికల ముందు సంక్షేమం పేరుతో అబద్ధపు హామీలిచ్చి తరువాం వాటిని అమలు చేయకుండా తప్పించుకోవడం చంద్రబాబు నైజం. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మహిళలకు అన్ని సంక్షేమ పథకాల్లో ప్రాధాన్యత కల్పించారు. కూటమి నాయకులు ఎన్నికల ముందు హామీ ఇచ్చిన ఆడబిడ్డ నిధి ఎప్పుడిస్తారో కనీసం స్పష్టమైన ప్రకటన చేయడం లేదు.

–జి.చాందిని, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం టెక్కలి నియోజకవర్గ అధ్యక్షురాలు

మహిళా సంక్షేమం ఎక్కడ..



మహిళల సంక్షేమం కోసం ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అటకెక్కాయి. మహిళలకు ఉచిత బస్సు, నెలకు రూ. 1500 ఇస్తామని చెప్పారు. వాటిని ఎక్కడ అమలు చేశారో కూటమి నాయకులు చెప్పాలి. ఈ ప్రభుత్వ హయాంలో మహిళా ప్రజాప్రతినిధులకు ప్రాధాన్యత ఎక్కడ ఉంది.

–జామి జయ, ఎంపీటీసీ సభ్యురాలు, జాడుపూడి, కంచిలి మండలం

నెలకు రూ. 1500 ఊసే లేదు



అర్హులైన మహిళలకు నెలకు రూ.1500 అందిస్తామని ఎన్నికల ముందు ఇచ్చిన హామీని చంద్రబాబు నిలబెట్టుకోలేక పోయారు. ఇంత వరకు కొత్తవారికే పింఛన్లు ఇవ్వలేదు. ఇంకా రూ. 1500 ఇస్తారంటే నమ్మబుద్ధి కావడం లేదు. ఎన్నికల ముందు బాబు ఇచ్చిన హామీలు ఎప్పటికీ నెరవేర్చరని అందరికీ మరోసారి అర్థమైంది. ఆడవారికి ఆశపెట్టి ఇలా మోసం చేస్తే తప్పకుండా బుద్ధి చెబుతారు

– బల్ల రేవతి, 15వవార్డు, కాశీబుగ్గ

గ్యాస్ పథకం రాయితీ డబ్బులు పడడం లేదు



చంద్రబాబు తొలిసారి పథకం పెట్టినప్పుడు నాకు దీపం పథకం కింద గ్యాస్ మంజూరు చేశారు. ఏడాదికి మూడు సిలిండర్లు రాయితీపై మహిళలకు ఇస్తామన్నారు. నా వరకు ఈ పథకం వర్తించలేదు. ఎవరిని అడగాలో తెలియదు. ఈ పథకం రాయితీ డబ్బులు రాలేదు. పేదలను నమ్మించి మోసం చేయడం కూటమి సర్కార్‌కు తగదు.

– చొట్టా లక్ష్మి, శ్రీహరిపురం, కవిటి మండలం

తుస్సుమన్న ఉచిత బస్సు



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్నా సూపర్ సిక్స్‌లో ఇచ్చిన ఉచిత బస్సు హామీని తుస్సు మనిపించారు. అదిగో ఉచిత బస్సు, ఇదిగో ఉచిత బస్సు అంటూ మహిళలను మభ్యపెడుతున్నారు. ఇప్పటికైనా సూపర్ సిక్స్ హామీలు నెరవేర్చాలి

– బోర పుష్ప, ఎంపీపీ, ఇచ్ఛాపురం

బాబుచేతిలో మోసపోయారు



గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళలకు పెద్దపీట వేసి అన్ని పథకాలు వారి ఖాతాలో వేసేవారు. నెలకు ఒక్కసారి అనేక పథకాలు చేతికంది నిత్యం కొనుగోలు, అమ్మకాలుతో మార్కెట్ సందడిగా ఉండేది. ఇప్పుడు ఎవరి ఖాతాలకు నగదు రాక అమ్మకాలు కొనుగోలు తగ్గి మార్కెట్ మందగించింది. మహిళలు చంద్రబాబు మాట నమ్మనప్పటికీ అనేక మంది ఏదో ఊహించారు. ఇప్పుడు అసలకే మోసం వచ్చింది. ప్రతీ నెల రూ. 1500 వస్తాయనే ఆశపోయింది.

–బడగల సుజాత, పురుషోత్తపురం, పలాస

ఉచిత బస్సు హామీపై నమ్మకం పోయింది



కూటమి ప్రభుత్వం ఇచ్చిన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం హామీని అమలు చేస్తారనే నమ్మకం పోయింది. ఎప్పటి నుంచి అమలు చేస్తారో కూడా చెప్పడం లేదు. హామీ ఇచ్చిన నాయకులే ఈ పథకం పట్ల మొహం చాటేశారు.

– సనపల రమణమ్మ, రాజపురం,కవిటి మండలం

క్లుప్తంగా

రేపు డయల్ యువర్ డీఎం

కాశీబుగ్గ: పలాస నుంచి భద్రాచలం, విజయవాడ రూట్‌లో ప్రయాణించే ప్రయాణికుల కోసం ఈనెల నాలుగో తేదీ ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పలాస ఆర్టీసీ డిపో మేనేజర్ ఆర్.సీతారామనాయుడు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రయాణికులు తమకు ఎదురవుతున్న సమస్యలు, ఇతర సూచనలు, సలహాలు 99592 25610 నంబర్‌కు ఫోన్‌కాల్ చేసి సమాచారం అందించాలన్నారు.

విద్యుత్ షాక్ మృతుల కుటుంబాలను ఆదుకోవాలి



సూర్యప్రకాశ్‌కు వినతిపత్రం అందజేస్తున్న శ్యాంప్రసాద్‌రెడ్డి

కంచిలి: తలతంపర పంచాయతీ పరిధి చిల్లపుట్టుగ గ్రామంలో గత నెల 26వ తేదీన జరిగిన విద్యుత్‌షాక్ సంఘటనలో ప్రాణాలు కోల్పోయిన ముగ్గురు కుటుంబాలకు నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని రాష్ట్ర సీడాప్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సాడి శ్యాంప్రసాద్‌రెడ్డి కోరారు. ఈ మేరకు ఏపీఈపీడీసీఎల్ డైరెక్టర్ ఆపరేషన్స్ టి.వి.సూర్యప్రకాశ్‌ను విశాఖపట్నంలోని కార్యాలయంలో సోమవారం కలిసి విన్నవించారు. ఆయన సానుకూలంగా స్పందించి నష్టపరిహారం మంజూరు చేస్తామని హామీ ఇచ్చినట్టు శ్యాంప్రసాద్‌రెడ్డి తెలిపారు.

కవితల పోటీలకు ఆహ్వానం

మందస: మందస ప్రజావిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఈ నెల ఐదో తేదీన ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని కవితల పోటీలు నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని వేదిక కన్వీనర్ మార్పు జగన్మోహన్‌రావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్నవారు పర్యావరణ పరిరక్షణ అనే అంశంపై కవితలు రాసి ఈ నెల ఐదో తేదీ ఉదయం ఎనిమిది గంటలకు హరిపురంలోని శ్రీవెంకటేశ్వర విద్యానికేతన్ వద్దకు హాజరు కావాలని కోరారు. ఒకటో తరగతి నుంచి పీజీ చదువుతున్న విద్యార్థులు పాల్గొనవచ్చన్నారు. విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు. ఆసక్తి ఉన్నవారు 93986 45293, 89850 19835 నంబర్లను ఈ నెల నాలుగో తేదీ సాయంత్రం ఆరు గంటల్లోపు సంప్రదించి పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు.

ఎమ్మెల్సీ పరామర్శ



సత్యన్నారాయణపాఢిని పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ రామారావు తదితరులు

కవిటి: పెద్దబాపనయ్యగా ఉద్దానం ప్రాంతంలోజ్యోతిష్యం, పౌరోహిత్యం, రాజకీయ రంగాల్లో ప్రజలకు విశేష సేవలం దించిన ప్రఫుల్లచంద్రపాఢి మృతి ఉద్దానం ప్రాంతానికి తీరని లోటని ఎమ్మెల్సీ నర్తు రామారావు విచారం వ్యక్తం చేశారు. ప్రఫుల్లచంద్రపాఢి మృతిచెందడంతో ఆయన కుమారుడు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత సత్యన్నారాయణ పాఢి కుటుంబ సభ్యులను ఎమ్మెల్సీ సోమవారం పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఆయన పవిత్రాత్మకు శాంతి చేకూరాలని కోరుతూ పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు సనపల ఈశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు సనపల కృష్ణారావు ఉన్నారు.

చక్రవర్తికి సన్మానం



చక్రవర్తిని సన్మానిస్తున్న నాయకులు

నందిగాం: వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శిగా నియామకమైన యర్ర చక్రవర్తికి సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో పలువురు నాయకులు సత్కరించారు. ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో చక్రవర్తికి నాయకులు శాలువాలు కప్పి సత్కరించారు. నాయకులు కురమాన బాలక్రిష్ణారావు, తమిరె ఫాల్గుణరావు, జడ్యాడ జయరాం, కణితి నారాయణమూర్తి,పోలాకి మోహనరావు,తమిరె రాజు, చిన్ని జోగారావు, ఎర్రన్న ఉన్నారు.

విద్యార్థులకు బస్‌పాసుల జారీ ప్రారంభం

కాశీబుగ్గ: విద్యార్థులకు బస్సుపాసుల జారీని సోమవారం నుంచి ప్రారంభించినట్టు పలాస ఆర్టీసీ డిపో మేనేజర్ ఆర్.సీతారామనాయుడు తెలిపారు. పాస్ కోసం వచ్చినవారు ఆధార్‌కార్డు, పదో తరగతి మార్క్‌లిస్ట్ జిరాక్సు, ప్రస్తుతం చదువుతున్న కళాశాల, పాఠశాల నుంచి సర్టిఫికెట్, పాస్‌ఫొటోలు, ఆన్‌లైన్ అప్లికేషన్ తీసుకురావాలన్నారు.

కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేసుకోవాలి

మందస:

ప్రతీ కుటుంబానికి హోం కంపోస్ట్ పిట్‌తో పాటు కిచెన్ గార్డెన్ తప్పనిసరిగా ఉండాలని ఐటీడీఏ అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ పైడి కూర్మారావు అన్నారు. ఈ విషయమై మహిళ సంఘ సభ్యులందరికీ అవగాహన కల్పించాలని సూచించారు. సోమవారం స్థానిక మండల సమాఖ్య కార్యాలయంలో ఏర్పాటు చేసిన సిబ్బంది సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ప్రజా ఆరోగ్యం, గ్రామీణ పారిశుధ్య నిర్వహణలో భాగంగా ఉపాధి హామీ పథకం నుంచి పశువులు పెంచుతున్న రైతులకు టైప్ వన్ కంపోస్ట్ పిట్లను, మిగతా వారికి టైప్ టు కంపోస్ట్ పిట్లను మంజూరు చేస్తున్నట్టు వివరించారు. మందస మండలంలో సుమారు తొమ్మిది వేల కంపోస్ట్ పిట్‌లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. అకౌంటెంట్ కళ్యాణి, కృష్ణకుమారి, డెటా ఎంట్రి ఆపరేటర్ రాజారావు, స్వామినాయుడు, ముఖలింగం ఉన్నారు.



మాట్లాడుతున్న కూర్మారావు

హామీలను నెరవేర్చాలి

పలాస: ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని వైఎస్సార్‌సీపీ పలాస నియోజకవర్గం ఎంప్లాయిస్ అండ్ పెన్షనర్ల విభాగం అధ్యక్షుడు కంచరాన చిన్న బాబు డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఈ నెల నాలుగో తేదీన చేపట్టనున్న 'వెన్నుపోటు దినం' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ఆధ్వర్యంలో కాశీబుగ్గ వైఎస్సార్ కూడలి నుంచి పలాస ఆర్డీవో కార్యాలయం వరకు జరుగునున్న ర్యాలీలో ప్రజలు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.



కంచరాన చిన్నబాబు

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



వైద్య శిబిరంలో రోటరీక్లబ్ ప్రతినిధులు, వైద్య బృందం

ఇచ్ఛాపురం: స్థానిక రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఉచిత అక్యూప్రెషర్ మెగా వైద్య శిబిరానికి ప్రజల నుండి విశేషస్పందన లభించింది. డాక్టర్ ఎం.ఎ.చాయ్‌నాన్, టి.హెచ్.పి.కె.పహడీయాన్, వైద్య బృందం ఆక్యూప్రెషర్ వైద్యసేవలను అందించగా 50 మంది సద్వినియోగం చేసుకున్నారు. ఈనెల ఏడో తేదీ వరకు నిర్వహించనున్న వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రోటరీక్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు మాచర్ల రాజ్‌కుమార్, పైడిశెట్టి దినేష్‌కుమార్ కోరారు.

కన్నీటి కష్టాలు



టెక్కలి ఎన్‌టీఆర్ కాలనీ 10, 11 వీధికి చెందిన ప్రజలు నీటి కష్టాలను ఎదుర్కొంటున్నారు. ఎండాకాలం కావడంతో ఇళ్లల్లో బావులు ఇంకిపోయాయని దీంతో మంచినీటి కోసం పడరాని పాట్లు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో పలుమార్లు అధికారులకు దరఖాస్తులు చేసినప్పటికీ పరిష్కారం కాలేదని వాపోయారు. అధికారులు స్పందించి వీధుల్లో కుళాయిలు వేయాలని కోరుతున్నారు.

–టెక్కలి

స్నేహితులకు అండగా..



తమతో కలసి చదువుకున్న స్నేహితులు కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నట్లు తెలుసుకున్న మిత్రులు స్పందించారు. చేయిచేయి కలిపారు. ఆదుకునేందుకు ముందుకు వచ్చారు. ఇచ్ఛాపురం మండలం ఈదుపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1996–2001 బ్యాచ్ పూర్వ విద్యార్థులు సోమవారం ఆత్మీయ సమావేశంలో స్నేహితులు కేశవ దొళాయి, లింగరాజు బిసాయిలు మూత్ర పిండాల వ్యాధితో బాధపడుతున్నట్టు తెలుసుకున్నారు. ఒక్కొక్కరికీ రూ.30 వేలు చొప్పున అందజేశారు.

–ఇచ్ఛాపురం రూరల్

'వెన్నుపోటు దినం' విజయవంతం చేయాలి

- పోస్టర్ల ఆవిష్కరణలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు



టెక్కలి: బూరగాంలో ప్రచారం చేస్తున్న నాయకులు

టెక్కలి: కూటమి ప్రభుత్వం ప్రజలకు చేసిన మోసాలను నిలదీస్తూ ఈ నెల నాలుగో తేదీన టెక్కలిలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న 'వెన్నుపోటు దినం' నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ నాయకులు కోరారు. సోమవారం బూరగాం, శాసనాం, తొలుసూరుపల్లి, పిట్టలసరియా, జగన్నాథపురం తదితర గ్రామాల్లో ప్రచారం చేసి కరపత్రాలను పంపిణీ చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు హెచ్.వెంకటేశ్వరరావు, నాయకులు సత్తారు సత్యం, తమ్మన్నగారి కిరణ్, సర్పంచ్ ఆర్.జయమోహన్, ఎస్.అప్పలస్వామి, పీత రమణబాబు, జె.తిరుమలరెడ్డి పాల్గొన్నారు.

ప్రజాపాలన గాలికి వదిలేశారు

ఇచ్ఛాపురం రూరల్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజా పాలనను గాలికి వదిలేశారని ఎంపీపీ బోర పుష్ప మండిపడ్డారు. స్థానిక ఎంపీపీ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ నాయకులతో కలసి 'వెన్నుపోటు దినం'పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. మండల పార్టీ కన్వీనర్ పాతిర్ల రాజశేఖర రెడ్డి, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు నర్తు నరేంద్ర యాదవ్, మాజీ ఎంపీపీ కారంగి మోహనరావు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దక్కత నూకయ్యరెడ్డి, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

బాబు మోసాలను ఎండగడదాం

నందిగాం: అధికారం కోసం అమలు కాని హామీలు ఇచ్చి తీరా అధికారంలోకి వచ్చాక పథకాలు ఇవ్వడం కష్టమని చెప్పి ఒక్క హామీ నిలబెట్టుకొని చంద్రబాబు మోసాలను ఎండగట్టేందుకు నిర్వహించనున్న వెన్నుపోటు దినాన్ని విజయవంతం చేయాలని ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి, వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి యర్ర చక్రవర్తి, జిల్లా ప్రధాన కార్యదర్శి కురమాన బాలక్రిష్ణారావు, పార్టీ మండల అధ్యక్షుడు తమిరె పాల్గుణరావులు కోరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు. అనంతరం నాయకులంతా నర్సిపురం, దేవళభద్ర, దిమిలాడ, లఖిదాసుపురం, మొండ్రాయివలస గ్రామాల్లో పర్యటించి కార్యక్రమానికి తరలిరావాలని కోరారు. నాయకులు జడ్యాడ జయరాం, చిన్ని జోగారావు, కణితి నారాయణమూర్తి, పోలాకి మోహనరావు, తమిరె రాజు, కవిటి ఎర్రన్న, తమిరె రాజు, దీర్ఘాశి క్రిష్ణారావు, రోణంకి బాబూరావు, పైల ధర్మారావు, కణితి గిరి పాల్గొన్నారు.

నిరసనకు తరలిరావాలి

ఇచ్ఛాపురం: సూపర్‌సిక్స్ హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిన కూటమి సర్కార్‌కు బుద్ధి చెప్పాలని ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. ప్రజల తరపున ప్రభుత్వానికి వ్యతిరేకంగా వైఎస్సార్‌సీపీ ఈనెల నాలుగు తేదీన చేపట్టనున్న 'వెన్నుపోటు దినం'నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. స్థానికంగా ఉన్న ఓ భవనంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు ప్రకాశరావు పట్నాయక్ ఆధ్వర్యంలో పోస్టర్లను ఆవిష్కరించారు. మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ లాబాల స్వర్ణమణి, క్రిస్టియన్ మైనారిటీ సెల్ అధ్యక్షుడు ప్రత్తి అన్వేష్, నాయకులు పిలక సంతోష్, కాళ్ల సత్యం, నీలాపు డిల్లి, జి.ప్రదీప్, గాంధీ, చాట్ల తిరుపతి, కిరణ్‌బెహర, బి.జగన్ పాల్గొన్నారు.

హామీల అమల్లో సర్కార్ విఫలం

సోంపేట: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమల్లో కూటమి ప్రభుత్వం విఫలమైందని ఎంపీపీ నిమ్మన దాస్ అన్నారు. వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నాలుగో తేదీన చేపట్టనున్న 'వెన్నుపోటు దినం'నిరసన కార్యక్రమం పోస్టర్లను సోంపేటలో ఆవిష్కరించారు. కార్యక్రమానికి తరలిరావాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మండల పార్టీ అధ్యక్షులు శిలగాన భాస్కరరావు, జింకిభద్ర సర్పంచ్ తామాడ పద్మావతి, నాయకులు పొందూరు సిర్మా, తోట డిల్లీ, పాతిన నాని, జక్కం రమేష్, తేజ పట్నాయక్, తెల్లి వైకుంఠరావు, రాజాం శ్రీను పాల్గొన్నారు.

నయవంచక ప్రభుత్వాన్ని నిలదీయండి

పలాస: ప్రజలకు అనేక రకాలు వాగ్దానాలు చేసి ఏడాది కావస్తున్న ఏ ఒక్కటి అమలు చేయని నయవంచక కూటమి ప్రభుత్వాన్ని ప్రజలు నిలదీయాలని వైఎస్సార్‌సీపీ పలాస మండల కమిటీ అధ్యక్షుడు దువ్వాడ రవి ప్రజలకు పిలుపునిచ్చారు. కాశీబుగ్గలోని పార్టీ కార్యాలయంలో 'వెన్ను పోటు దినం'వాల్ పోస్టర్లను ఆవిష్కరించా మాట్లాడారు. నాయకులు ఉంగ సాయిక్రిష్ణ, పైల చిట్టిబాబు, బత్తిన హేమేశ్వరరావు, జి.మోహనరావు, బమ్మిడి దుర్యాధనరావు, బొత్స షణ్ముఖరావు, కొర్ల మురళీక్రిష్ణ పాల్గొన్నారు.



సోంపేట: పోస్టర్ల ఆవిష్కరణలో ఎంపీపీ నిమ్మన దాస్, నాయకులు



పలాస: వెన్ను పోటు దినం వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు



ఇచ్ఛాపురం రూరల్: వెన్నుపోటు దినం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పార్టీ శ్రేణులు



నందిగాం: పోస్టర్ ఆవిష్కరణలో నాయకులు



ఇచ్ఛాపురం: వెన్నుపోటు దినం పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ రామారావు తదితరులు

వైభవంగా చింతామణి సంబరాలు



కవిటి మండలం డొంకపుట్టుగలో వెలసిన గ్రామదేవత చింతామణి అమ్మవారి సంబరాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం రాత్రి గ్రామానికి అమ్మవారిని ఆహ్వానించారు. మూడు రోజు అమ్మవారి ప్రతిరూపాలను గ్రామ వీధుల్లో మేళతాళాలు, బాణసంచా కాల్పుల నడుమ వైభవంగా ఊరేగించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వీధినాటకాలు, విద్యుత్ దీపకాంతులు ఆకట్టుకున్నాయి.

–కవిటి

స్వేచ్ఛా నృత్య తరంగిణికి నాట్యశివ అవార్డు

ఇచ్ఛాపురం టౌన్: ఇచ్ఛాపురంలోని స్వేచ్ఛా నృత్య తరంగిణికి చెందిన కళాకారులు అరుదైన గుర్తింపు పొందారు. ఈ నెల ఒకటో తేదీన తమిళనాడులోని రామేశ్వరంలో జరిగిన నృత్యంజలి ఫెస్టివల్స్ నాట్య ప్రదర్శనలో మంచి ప్రతిభ కనబర్చడం ద్వారా నాట్యశివ అవార్డు వరించింది. ఈ విషయాన్ని స్వేచ్ఛానృత్య తరంగిణి అకాడమి అధ్యక్షులు కె.గోవిందరావు సోమవారం తెలిపారు. కార్యక్రమ నిర్వహకులు శరత్‌చంద్ర చేతులు మీదుగా బహుమతి అందుకున్నామన్నారు. నాట్యగురువు మంగి దివ్య, కళాకారులు భూమిక, జోషిక, శరన్య, అస్మిత, సంజన, జోస్న, యశోద, భవ్యశ్రీ, దేవిశ్రీ పాల్గొన్నారన్నారు.



బహుమతులతో స్వేచ్ఛానృత్య తరంగిణి కళాకారులు

వేళకు రారు..అడిగేవారు లేరు!

ఇచ్ఛాపురం రూరల్: గత ప్రభుత్వ హయాంలో స్వగ్రామంలోనే ప్రజలకు మెరుగైన సేవలు అందించే గ్రామ సచివాలయాలు కూటమి ప్రభుత్వం వచ్చాక నిర్వీర్యమైపోయాయి. ఈదుపురంలో రెండు గ్రామ సచివాలయాలు ఉన్నప్పటికీ ఉదయం 11, 12 గంటల వరకు సిబ్బంది హాజరు కావడం లేదని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సోమవారం భూములకు ఆధార్ లింక్, రేషన్ కార్డుల కోసం లబ్ధిదారులు గ్రామ సచివాలయంలో పడుగాపులు కాశారు. 11 గంటల సమయంలో డీఏ శివానీ రావడంతో లబ్ధిదారులు సిబ్బంది తీరుపై మండిపడ్డారు.



ఈదుపురం సచివాలయం వద్ద పడుగాపులు కాస్తున్న ప్రజలు

జగన్నాథపురంలో వైద్య వైద్యం

టెక్కలి రూరల్: జగన్నాథపురం గ్రామంలో సోమవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. గ్రామానికి చెందిన మెడికల్ పీజీ విద్యార్థి సింగుపురం మోతీలాల్ ఆత్మహత్య చేసుకున్న విషయం విదితమే. సోమవారం మోతీలాల్ సంస్మరణార్థం ఉచిత వైద్య శిభిరం నిర్వహించారు. మోతీలాల్ మిత్రులు డాక్టర్ సతీష్ ఆధ్వర్యంలో రోగులను పరీక్షించి మందులు అందజేశారు.



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు